ఇసుక కొండకు కార్తీక శోభ

15న పౌర్ణమి పూజలు • వేలాదిగా తరలి రానున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఆలయం (ఇన్‌సెట్) రమా సహిత సత్యనారాయణ స్వామి

డాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం కార్తీక శోభ సంతరించుకుంది. పౌర్ణమి అనగానే భక్తులందరికీ గుర్తొచ్చేది సత్యదేవుని ఆలయం. అటువంటిది కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమికి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకోవడమే కాక సామూహిక వ్రతాల్లో పాల్గొంటారు. అన్నవరం సత్యదేవుని అంతటి ప్రాచుర్యం పొందిన ఇసుకకొండ సత్యదేవుని ఆలయం ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రముఖ దేవాలయంగా మారింది. ఈ నెల 15న కార్తీక పౌర్ణమికి వేలాది మంది భక్తులు తరలి రానున్న దృష్ట్యా ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. అదనపు క్యూలైన్ల ఏర్పాటు, ప్రత్యేక ప్రసాదం కౌంటర్లు, మంచినీటి సౌకర్యం కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

దేవాలయ చరిత్ర..

ఈ దేవాలయం సుమారు 200 సంవత్సరాల కిందట సీతారామ్ బాబాజీ అనే సాధువు (సిద్ధ పురుషుడు) నిర్మించినట్లు పూర్వీకులు చెబుతారు. ఉత్తర హిందుస్థాన్ మహారాష్ట్ర నుంచి పాలరాతి విగ్రహాలు తీసుకొచ్చి ప్రతిష్ట చేసి ఆలయాన్ని నిర్మించారు. 1986లో రూ.40 లక్షలతో రాజ గోపురం, అనివెట్టి మండపం, విమాన గోపురం, వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఆగమ పండితుల సలహా మేరకు దక్షిణాది ఆచారం ప్రకారం కృష్ణశిల విగ్రహాలు (నల్లరాతి) ప్రతిష్ఠించారు. భక్తుల తాకిడి దృష్ట్యా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు అవకాశం కల్పించడం లేదని ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.



ఏకాదశి పూజల సందర్భంగా భక్తులతో కిటకిటలాడిన స్వామి వారి ఆలయం

కిటకిటలాడిన ఆలయం..

కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా మంగళవారం ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే స్వామి దర్శనానికి భక్తులు బారులుదీరారు. పెద్ద ఎత్తున సామూహిక వ్రతాలు జరిగాయి.

నిత్యపూజలు..

స్వామి వ్రతం, ధ్వజస్తంభ పూజ, విశేష దర్శనం జరుగుతాయి. ధ్వజస్తంబ పూజ, విశేష దర్శనం చేయించుకోదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. ఆలయం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు, పౌర్ణమి రోజు ఉదయం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా తెరిచే ఉంటుంది. మహానివేదన ఉదయం 11.40 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది.

ఏర్పాట్లు పూర్తి..

కార్తీక పౌర్ణమి (విశేష పౌర్ణమి)ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న దృష్ట్యా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ల ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, ప్రత్యేక ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. వివిధ దేవాలయాల నుంచి సిబ్బంది సహకారం తీసుకుంటున్నాం.

– రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ఈవో

క్లుప్తంగా

ఏఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఉత్తమ బహుమతి



డాక్టర్ రమ్యశ్రీని అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీలోని పీడియాట్రిక్ సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రమ్యశ్రీ బడే ఐఏపీఎస్ 50వ వార్షిక జాతీయ సదస్సులో భాగంగా ఇన్నోవేటివ్ సర్జరీ సెషన్‌లో ఉత్తమ బహుమతిని అందుకున్నారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు రిషికేష్‌లో జరిగిన ఈ ఇండియన్ జాతీయ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్ సర్జన్స్(ఐఏపీఎస్) సదస్సులో ఆమె ప్రజెంటేషన్ ఇచ్చారు. నవజాత శిశువులకు ఆహారనాళం (ఎసోఫేగస్)లో ఫీడింగ్ ట్యూబ్‌లను ప్రస్తుతం ఉపయోగిస్తున్నారు. ఈ ఫీడింగ్ ట్యూబ్‌లకు బదులుగా కొత్త, సురక్షితమైన ఆహారం ఇచ్చే విధానం అమలులోకి వచ్చింది. ఈ విధానంపై ప్రజెంటేషన్ ఇచ్చిన డాక్టర్ రమ్యశ్రీ .. ఈ విధానం వల్ల పలు వ్యాధులను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ఆమె అద్భుత ప్రదర్శనకు న్యాయ నిర్ణేతలు మంత్రముగ్ధులై.. ఉత్తమ బహుమతికి ఎంపిక చేశారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, విభాగాధిపతులు డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్, డాక్టర్ భాస్కర్‌రెడ్డి తదితరులు డాక్టర్ రమ్యశ్రీని అభినందించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి



పారిశుధ్య కార్మికులను అభినందిస్తున్న సీఎంహెచ్‌వో, ఏఎంహెచ్‌వో

అల్లిపురం: విజయవాడ వరదల్లో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది అందించిన సేవలు మరువలేనివని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 33వ వార్డు కుమ్మరవీధి సచివాలయం ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు ఏఎంహెచ్‌వో సత్యనారాయణరాజు, వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి తదితరులు పాల్గొని విజయవాడ వరదల్లో సేవలందించిన పారిశుధ్య కార్మికులను అభినందించి చీరలు, బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

చురుగ్గా హౌసింగ్ డీడీల వాపస్

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో గల హౌసింగ్ దరఖాస్తుదారులకు డీడీల వాపస్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు జోన్ – 3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ పర్యవేక్షణలో యూసీడీ విభాగం అధికారులు చెక్కుల వాపస్ ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇళ్లు మంజూరు కాని దరఖాస్తుదారులకు డిపాజిట్ల వాపస్ కోసం ప్రభుత్వం రూ.76.27 లక్షల మేరకు నిధులు విడుదల చేసింది. దీంతో రోజుకి 30 మంది దరఖాస్తుదారుల వివరాలు బయోమెట్రిక్ విధానంలో నమోదు చేస్తున్నారు. హౌసింగ్ డీడీ, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ వివరాలు యూసీడీ విభాగం సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జోన్ – 3 పరిధి తూర్పు నియోజకవర్గంలో 223 మంది, ఉత్తర నియోజకవర్గంలో 30 మంది దరఖాస్తుదారులున్నారు. ఇప్పటి వరకు మొత్తం 167 మంది దరఖాస్తుదారులకు రూ.63.25 లక్షల మేర డిపాజిట్లు వాపస్ చేశారు. ఇంకా 86 మంది దరఖాస్తుదారులకు రూ.12.50 లక్షల మేర డిపాజిట్లు వాపస్ చేయాల్సి ఉంది. యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.రాము ఆధ్వర్యంలో సిబ్బంది రోజుకి 30 మంది దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి ఆశీలమెట్టలోని జోన్ – 3 కార్యాలయానికి రప్పించి వివరాలు నమోదు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 18లోగా మిగిలిన దరఖాస్తుదారులకు చెక్కులు అందజేస్తామని ఏపీడీ రాము తెలిపారు.



ఇదేం తీరు సారూ!

కేసులు రాయటంపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై లేకపోవడంతో చాలా చోట్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలో గొల్లల పాలెం ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 అంబులెన్స్‌ను గమనించవచ్చు. అదే విధంగా పూర్ణా మార్కెట్‌లోనూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విధులు వదిలేసి కేసులు రాస్తున్న ట్రాఫిక్ పోలీసులను చిత్రంలో చూడవచ్చు.



– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ధర్నా




జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

సీతమ్మధార: ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీపార్కులో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న విజయవాడలో జరిగే ఆటోడ్రైవర్ల మహా ధర్నాలో పాల్గొని ప్రభుత్వం కళ్లు తెరిపించాలని ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 21, 31 రద్దు చేయాలని, ఆటో డ్రైవర్లకు వెంటనే వాహన మిత్ర అమలు చేయాలని, డ్రైవర్లపై ఉన్న పోలీస్ కేసులు, ఆర్టీవో చలనాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో స్టాండ్ అధ్యక్షుడు వై.వెంకట్, హెచ్. శేఖర్, ఎంఏ ఖాన్, కేలం శివ, ఎం.మధురెడ్డి, రావికృష్ణ, ఎస్. చెన్నారెడ్డి, అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ దందా

- జీవీఎంసీ చేస్తున్న పనులు తామే చేయిస్తున్నామని నమ్మించి వసూళ్లు
- పాతనగరంలో కొత్త తరహా మోసం



అక్రమ దందా చేస్తున్న వారు ఇస్తున్న రశీదు

జగదాంబ: జీవీఎంసీ చేస్తున్న అభివృద్ధి పనులు తామే చేయిస్తున్నామంటూ కొంత మంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ పాతనగర వాసులు వాపోతున్నారు. కార్పొరేటర్, ఎమ్మెల్యే, ఎంపీకి డబ్బులు ఇవ్వాలి అప్పుడే వెంటనే పనులు అవుతాయని నమ్మబలుకుతున్నారని చెబుతున్నారు. జీవీఎంసీ 39వ వార్డులో టీమ్ లడ్డు వెల్ఫేర్ సొసైటీ పేరుతో ఓ దందా టీమ్ ఏర్పడింది. వీరందరూ రోజూ జీవీఎంసీ వార్డులో చేస్తున్న శానిటేషన్, విద్యుత్, కాలువలు, కల్వర్టుల పరిశుభ్రం వంటి పనులు జరుగుతున్న చోటుకు చేరుకుంటున్నారు. పనులు చేస్తున్న కార్మికుల పట్ల జాలి చూపించి మజ్జిగ, చల్లటి తాగునీరు వంటివి ఇవ్వడం, జరుగుతున్న పనులను సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తూ హడావుడి చేస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది వెళ్లిపోగానే లడ్డూ టీమ్ ఇంటింటికీ, దుకాణాలకు వెళ్లి తామే ఈ పనులు చేయిస్తున్నామని, డబ్బులు కూడా ఖర్చు చేస్తున్నామని చెప్పి రశీదులు ఇచ్చి డబ్బులు దండుకుంటున్నారు. ఇవ్వని వారిపై దందా చేసి తాము కష్టపడి పనులు చేయిస్తే ఎందుకు ఇవ్వరని భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా నలుగురిలో పరువు తీసి మాట్లాడుతున్నారని పాతనగర వాసులు చెబుతున్నారు.

ఎవరీ లడ్డూ టీమ్ హెడ్.

గతంలో కూడా ఈ టీమ్ హెడ్ ఇలానే దందా చేసినట్టు పాతనగరంలోని బాధితులు చెబుతున్నారు. ఇప్పుడు వన్‌టౌన్‌లో కూడా పదిమంది వ్యక్తులను వెనుకేసుకుని ఇదే తరహా దందా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈ తరహా దందా నుంచి తమను కాపాడాలని పాతనగర వాసులు కోరుతున్నారు.

దయనీయ స్థితిలో భవన నిర్మాణ కార్మికులు



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

డాబాగార్డెన్స్: భవన నిర్మాణ కార్మికులకు పూట గడవడమే కష్టంగా ఉందని సీపీఎం రాష్ట్ర పిలుపు మేరకు మంగళవారం సింగ్ హోటల్ జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మికులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం నాయకుడు కె. నరసింహారావు, సిటు నాయకుడు కేవీపీ చంద్రమౌళి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సరైన పని దొరకడం లేదని, పూట గడవడమే కష్టంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు నిత్యావసర సరకుల ధరలు అదుపులోకి తెస్తామని, ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పడమే కాక నిరుద్యోగులకు భృతి, కొత్త ఉద్యోగాల కల్పన, ధరల నియంత్రణ ఇలా ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు నట్టేట ముంచిందని, ఫలితంగా భవన నిర్మాణ కార్మికులు నడిరోడ్డుపై పడాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. హామీలు నిలబెట్టుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సిమ్మునాయుడు, జనార్దనరావు, బుజ్జి, శ్రీను, నాయుడు, దుర్గా, పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సభ విజయవంతానికి పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

డాబాగార్డెన్స్: కేంద్రంలోని మోదీ నాయకత్వంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపునిచ్చిన ప్రదర్శనలు, సభ విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సిటు కార్యాలయంలో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం సీఎఫ్‌టీయూ నాయకుడు కనకారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శన, సభ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ అచ్యుతరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం 3వ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత తన మెజార్టీ తగ్గినా, కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేయడంలో దూకుడు పెంచిందన్నారు. దీనిలో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే విధంగా కుట్రలు పన్నుతోందన్నారు. కార్మికుల జీతభత్యాలు సకాలంలో చెల్లించకపోవడం, వీఆర్ఎస్ పేరిట 2500 మంది కార్మికులను కుదించడం, 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించడం వంటి చర్యలకు పూనుకుంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకుంటామన్నారు. కార్మికులకు నష్టం చేస్తున్న 4 లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు తక్కువ లేకుండా చెల్లించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, వివిధ ప్రభుత్వ స్కీమ్స్‌లో పని చేస్తున్న అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, వీవోఏ, ఆర్‌పీలు, ఆటో, ముఠా, భవన నిర్మాణం, తోపుడుబండ్లు, రవాణా రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలనే పలు డిమాండ్లతో ఈ ప్రదర్శన, సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె. శంకర్రావు, ఐఎఫ్‌టీయూ నాయకుడు తిరుపతి రావు, ఏపీఎఫ్‌టీయూ నాయకుడు దేవా, సిటు జిల్లా కార్యదర్శులు బి. జగన్, ఎం. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి టర్నర్ చౌల్ట్రీలో పుస్తక మహోత్సవం



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు పైడిరాజు

మహారాణిపేట: ఈనెల 14 నుంచి విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో డిసెంబర్ 15 వరకు 23వ పుస్తక మహోత్సవం నిర్వహిస్తున్నట్టు సీపీఐ నాయకుడు ఎం. పైడిరాజు తెలిపారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహిస్తారని, నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, హిమాన్షు బుక్ డిపో అధినేత కె.వి.ఎస్.కె. ప్రసాద్, విశాలాంధ్ర పబ్లిసింగ్ హౌస్ మేనేజర్ టి. మనోహర్ నాయుడు హాజరు కానున్నారని తెలిపారు. ఉన్నతమైన సమ సమాజాన్ని అందించాలనే లక్ష్యంతో విశాలాంధ్ర విజ్ఞాన సమితి 1962లో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌ను స్థాపించిందన్నారు. పుస్తక మహోత్సవాన్ని ప్రథమంగా 1991లో టర్నర్ చౌల్ట్రీలో ప్రారంభించి, విశాఖకే ఒక నూతన ఒరవడిని తీసుకువచ్చామన్నారు. సాహితీమూర్తుల సాహిత్యంతో పాటు ప్రముఖ తెలుగు ప్రచురణకర్తల పుస్తకాలు ప్రదర్శనలో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అదే విధంగా ప్రముఖ ఆంగ్ల ప్రచురణ కర్తలు, వివిధ రంగాలకు సంబంధించిన 60 ప్రచురణ సంస్థలు, 25 వేల రకాల పుస్తకాలు సేకరించి ప్రదర్శనలో ఉంచుతున్నామన్నారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల లక్ష్మణరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక పుస్తకాలు, యోగా పుస్తకాలు, పిల్లల సాహిత్యం, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు ఉంటాయని తెలిపారు. ప్రదర్శన జరిగే ప్రతిరోజు సాయంత్రం సాహితీవేత్తలు, రచయిత సంఘాలతో సాహిత్య సభ జరుగుతుందని తెలిపారు. విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పీఏ రాజు మాట్లాడుతూ పాఠకులు, పుస్తక ప్రియులు, విద్యార్థులు, గృహిణులు ఈ పుస్తక ప్రదర్శనకు విచ్చేసి తమ అభిరుచికి తగిన పుస్తకాలు కొనుగోలు చేసి, పుస్తక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 14 నుంచి వచ్చే నెల 15 వరకు ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 8.30 వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

కుటుంబం చెంతకు యువతి



కుటుంబ సభ్యులకు సోనంను అప్పగిస్తున్న శ్రద్ధా టీమ్ సభ్యులు

సీతమ్మధార: మధ్యప్రదేశ్ నుంచి విశాఖ వచ్చేసిన ఒక యువతిని ఏయూటీడీ సంస్థ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. సంస్థ తెలిపిన వివరాలివి. మధ్యప్రదేశ్ నుంచి విశాఖ వచ్చేసిన సోనం (22)ను ఆరు నెలల క్రితం విశాఖ రైల్వేస్టేషన్లో గుర్తించి ఏయూటీడీ సిబ్బంది ద్వారకానగర్‌లో గల టి.ఎస్.ఆర్. కాంప్లెక్సులో ఉన్న జీవీఎంసీ – ఏయూటీడీ మహిళా షెల్టర్‌కు తరలించారు. మానసిక వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకుని శ్రద్ధా ఫౌండేషన్ నుంచి వచ్చిన సైకియాట్రిస్ట్ డాక్టర్ స్వరాలి చికిత్స చేశారు. కోలుకున్న సోనంను మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ దగ్గర లస్కర్ గ్రామానికి శ్రద్ధా టీం ద్వారా వైజాగ్ నుంచి నేరుగా తీసుకెళ్లి ఆమె నానమ్మ సుమిత్ర బాయ్, తాత లక్ష్మారాంలకు అప్పగించారు. చుట్టుపక్కల వాళ్లు ఈ అమ్మాయిని అమ్మేసామని నిందలు పడ్డామని, సోనం తిరిగొచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని వారు తెలిపారు. సోనం ఇంటి పనంతా చక్కగా చేసేదని, ఇంకా పెళ్లి కాలేదని, మూడు సంవత్సరాల క్రితం మానసిక వ్యాధితో బాధపడుతూ ఇల్లు వదిలి వెళ్లిపోయిందని చెప్పారు. తల్లిదండ్రులు, చెల్లి, తమ్ముడు అందరూ పనికోసం నాగపూర్ వెళ్లడంతో వాళ్ళతో ఫోన్‌లో మాట్లాడించారు. తండ్రి వచ్చి పెద్ద కూతురుని తీసుకెళ్తామని చెప్పారని శ్రద్ధా సోషల్ వర్కర్ మనీషా బరాదియా, ప్రగడ వాసు వివరించారు. సోనం కుటుంబ సభ్యులు ఏయూటీడీ, శ్రద్ధా సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే వెంకన్న దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టును విశేషంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు.

అలివేలు మంగమ్మ ఆలయంలో..

వేంకటేశ్వర మెట్టపై వెలసిన అలివేలు మంగమ్మ అమ్మవారి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.